సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



వచ్చేశాయ్.. కొత్త పెన్షన్లు
జిల్లాలో 7,500 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయి. ప్రతి నియోజకవర్గంలో 700 నుంచి 1100 మందికిపైగా లబ్ధిదారులు పెరిగారు. - 8లో..



సెల్యూట్ జ్యోతి
కొమరోలు మండలం ద్వారకచర్ల గ్రామానికి చెందిన బొడ్డు జ్యోతి తన కష్టాలను అధిగమించి తెలంగాణలో ఏఆర్ ఎస్సైగా ఉద్యోగం సాధించింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
38/26.7

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

మాగుంట కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

- సంబంధం లేని కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారు
- త్వరలోనే కేసు పరిష్కారమవుతుంది
- మాగుంట రాఘవరెడ్డి రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్నా..
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే బాలినేనిని సన్మానిస్తున్న మాగుంట రాఘవరెడ్డి, పక్కన బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: మాగుంట కుటుంబం గత 40 సంవత్సరాలకుపైగా మద్యం వ్యాపారం చేస్తుండగా, ప్రస్తుతం సంబంధం లేని కేసుల్లో వారిని ఇరికించాలని యత్నిస్తున్నారని, అందులో భాగమే మాగుంట రాఘవరెడ్డి అరెస్టని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. బెయిల్ పొందిన తర్వాత తొలిసారి ఒంగోలు వచ్చిన మాగుంట రాఘవరెడ్డి గురువారం స్థానిక బాలినేని నివాసానికి వెళ్లారు. బాలినేని శ్రీనివాసరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డిని కలవగా వారు ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డిని మాగుంట రాఘవరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. కొద్దిసేపు రాఘవరెడ్డితో చర్చించిన అనంతరం మీడియాతో బాలినేని మాట్లాడారు. మాగుంట కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నా, వైఎస్సార్ సీపీలో ఉన్నా మాగుంట కుటుంబానికి, తమ కుటుంబానికి మంచి అనుబంధం ఉందన్నారు. ప్రకాశం జిల్లా ప్రజలకు మాగుంట కుటుంబం సేవలు అవసరమన్నారు. మాగుంట కుటుంబం నుంచి రాఘవరెడ్డి రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. రాజకీయాల్లో ఆయన రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు బాలినేని తెలిపారు. రాఘవరెడ్డిపై నమోదైన కేసు కూడా త్వరలోనే పరిష్కారమవుతుందన్నారు. భవిష్యత్తులో వ్యాపారపరంగా, రాజకీయంగా కూడా వారు ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు బాలినేని పేర్కొన్నారు. రాఘవరెడ్డి వెంట సూపర్‌బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పక్కా తోడు..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన పశ్చిమ ప్రకాశంలో ప్రస్తుతం అభివృద్ధి పరుగులు తీస్తోంది. సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తూనే అందుకు సంబంధించిన వ్యవస్థలకు పక్కా భవనాలు సమకూర్చే దిశగా ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ప్రధానంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు భవనాలు నిర్మిస్తోంది. 412 భవన నిర్మాణాలు చేపట్టగా వాటిలో 252 పూర్తయ్యాయి. మిగతా వాటి పనులు వేగంగా జరుగుతున్నాయి.

- పశ్చిమాన అభివృద్ధి పరుగులు
- 139.29 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకేలకు పక్కా భవనాలు
- 412 భవన నిర్మాణాల్లో 252 పూర్తి
- జోరుగా.. మిగిలిన భవనాల నిర్మాణ పనులు



పుల్లలచెరువులోని రైతు భరోసా కేంద్ర భవనం



వేములకోట సచివాలయం

మార్కాపురం :

టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన వ్యవస్థలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గాడినపడ్డాయి. జన్మభూమి కమిటీలతో ఇబ్బందులు పడిన ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి సిఫార్సులు లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయి. గ్రామ సచివాలయాల వ్యవస్థ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. టీడీపీ ప్రభుత్వంలో దండగలా మారిన వ్యవసాయం రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పండుగలా మారింది. పట్టణానికి రాకుండా ఇంటికి దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు నాణ్యమైనవి కొనుగోలు చేసుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, గిట్టుబాటు ధరలను ఎప్పటికప్పుడు ఆర్‌బీకేకి వెళ్లి ఆన్‌లైన్‌లో చూసుకుంటున్నారు. నిర్లక్ష్యానికి గురైన వైద్య రంగం కూడా గాడినపడింది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు ఇంటి ముంగిటకే డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇలాంటి కీలక వ్యవస్థలకు సొంత భవనాల నిర్మాణానికి సైతం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వాటి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఏదైనా ప్రభుత్వ పథకం అమలు కావాలంటే కుల, మత, వర్గ ప్రాతిపదికన జన్మభూమి కమిటీలు సిఫార్సు చేస్తేనే వచ్చేవి. పింఛను కావాలంటే ఆ గ్రామంలో ఎవరో ఒకరు పింఛన్‌దారులు చనిపోతే వారి స్థానంలో కొత్త పింఛను వచ్చేది. రేషన్ కార్డు కావాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సు చేయాలి. దీంతో ఐదేళ్లపాటు అర్హులైన ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం నానా అగచాట్లు పడ్డారు. ఈ దుస్థితి నుంచి ప్రజలు బయటపడేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రజలకు కావాల్సిన జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్లు, రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, చేదోడు లాంటి పథకాలను సకాలంలో ప్రజలకు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ పథకాలకు అర్హత ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ.29.08 లక్షలు మంజూరు చేసింది. ఇవి కాకుండా 46 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేసింది. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.20.08 లక్షలు కేటాయించింది. దీంతో పశ్చిమ ప్రకాశంలో రూ.139.29 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

సచివాలయాలు...

నియోజకవర్గం	మంజూరైనవి	పూర్తయినవి	వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి
మార్కాపురం	59	40	19
గిద్దలూరు	79	47	32
యర్రగొండపాలెం	81	53	28

రైతు భరోసా కేంద్రాలు

నియోజకవర్గం	మంజూరైనవి	పూర్తయినవి	వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి
మార్కాపురం	59	37	22
గిద్దలూరు	70	40	30
యర్రగొండపాలెం	64	35	29



బేస్తవారిపేట మండలం పెద్దఓబినేనిపల్లిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్

మంజూరైన సచివాలయ భవనాలు **219**
పూర్తయిన నిర్మాణాలు **140**
మంజూరైన ఆర్‌బీకేలు **193**
పూర్తయిన నిర్మాణాలు **112**

పశ్చిమ ప్రకాశంపై ప్రత్యేక దృష్టి



పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా మార్కాపురానికి మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. పశ్చిమాన అన్ని గ్రామాలకు తాగునీరు ఇచ్చేందుకు గొట్టిపడియ వద్ద ఇన్‌టేక్‌వెల్ ట్యాంకు నిర్మాణం జరుగుతోంది. మూడు నియోజకవర్గాల్లోని సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, నాడు–నేడు కింద పాఠశాల అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.
– డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక శాఖామంత్రి

సచివాలయాల ద్వారా అభివృద్ధి విప్లవం



గ్రామ సచివాలయాల ద్వారా పల్లెల్లో అభివృద్ధి విప్లవం ప్రారంభమైంది. 530కిపైగా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గతంలో వివిధ రకాల సర్టిఫికెట్ల నిమిత్తం పనులు మానుకుని రోజుల తరబడి మండల కేంద్రాలకు వచ్చి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి గ్రామాల్లో లేదు. నేరుగా సచివాలయానికి వెళ్లి అన్ని రకాల సేవలు, పథకాలు పొందవచ్చు. దేశంలోనే మన సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు ఆదర్శంగా ఉన్నాయి.
– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే, మార్కాపురం

దేశానికి ఆదర్శంగా రైతు భరోసా కేంద్రాలు



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు ఆర్‌బీకేల్లో లభిస్తున్నాయి. అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు, పశుపోషకులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ కేంద్రాలను రైతులు ఉపయోగించుకోవాలి
– అన్నా వెంకట రాంబాబు, ఎమ్మెల్యే, గిద్దలూరు

అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి రాఖీ కడుతున్న మహిళా కార్పొరేటర్లు



ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి రాఖీ కడుతున్న మేయర్ గంగాడ సుజాత

- రాఖీ వేడుకల్లో ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంట

ఒంగోలు: అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి భరోసా ఇచ్చారు. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ మహిళా కార్పొరేటర్లు, నాయకులు గురువారం ఉదయం ఎమ్మెల్యే, ఎంపీల నివాసాలకు వెళ్లి వారికి రాఖీలు కట్టి ఆశీసులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలినేని వాసన్న, మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్న తమపై చూపించే ఆప్యాయత తమకు రక్ష అని కొనియాడారు. బాలినేని, మాగుంట మాట్లాడుతూ తమది అక్కాచెల్లెమ్మల ప్రభుత్వమని, తప్పకుండా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఆశీర్వదించారు.

పేదింటి వెలుగులు.. నవరత్నాలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు అన్ని వర్గాలకు చెందిన పేదల ఇళ్లలో వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పెద్దారవీడు మండలం చట్లమిట్ల సచివాలయం పరిధిలోని రాజంపల్లి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్నారని తెలిపారు. ఆ సమయంలో ఇచ్చిన హామీలను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాల ద్వారా అమలుచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని వివరించారు. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదింటికి చేరాలన్న ఉద్దేశంతో గ్రామ, వార్డు సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశపెట్టి అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్నారని అన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిపొందని వారుంటే న్యాయం చేసేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటింటికీ పంపిస్తున్నారని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమను ఆదరిస్తున్నారని, అనేక మంది రూ.7 లక్షలకుపైగా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందినట్లు చెబుతున్నారని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను సీఎం కేటాయించారని చెప్పారు. ఆ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల గగ్గోలు...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని మంత్రి సురేష్ పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కనీసం అవ్వాతాతలు పింఛన్ తీసుకోవడానికి కూడా అనేక ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. అనంతరం రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ యారువ చలమారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, తిరుమలనాథస్వామి ట్రస్ట్ చైర్మన్ దుగ్గేల వెంకటరెడ్డి, సర్పంచ్‌లు వై.అల్లూరమ్మ, ఆదినారాయణ, రమణారెడ్డి, సుబ్బయ్య, నాగరాజు, మల్లేశ్వరి, ఎంపీటీసీ–2 సుబ్బమ్మ, భాగ్యరేఖ, నాయకులు ఒద్దుల లక్ష్మీరెడ్డి, షేక్ కాశింబాషా, కంచర్ల కేశయ్య, డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ బాలకోటయ్య, ఏపీవో ఆకుల సాంబశివయ్య, ఎంఈఓ శ్రీనివాసరావు, ఏఓ బుజ్జిబాయి, ఏఈలు రవీంద్రరెడ్డి, ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచడమే చంద్రబాబు నైజం

- టీడీపీ హయాంలో అడుగడుగునా మోసం
- పంటల బీమాతో పాటు పంట నష్టపోయిన రైతులకూ అన్యాయం
- అప్పులతో ఆత్మహత్యలు చేసుకున్న రైతులు
- ఆయా కుటుంబాలను ఆదుకున్న సీఎం జగన్
- నేడు ప్రతి రైతు మొహంలో ఆనందం
- ప్రతి పంటకు మద్దతు ధర కంటే అధికంగా రేటు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి మారెడ్డి సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న మారెడ్డి సుబ్బారెడ్డి

ఒంగోలు: అడుగడుగునా రైతులను మోసం చేసే నైజం చంద్రబాబు సొంతమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి మారెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే రైతుల అప్పులు తీరుస్తానని, బ్యాంకుల్లో తాకట్టులో ఉన్న మహిళల పుస్తెలతాడులు విడిపిస్తానని ప్రకటించిన చంద్రబాబు.. 2014లో గద్దెనెక్కిన తర్వాత చేసిన మోసానికి రైతులు నోటీసులు అందుకుని కోర్టుల మెట్లు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతు ప్రతినిధులు పలువురు వెళ్లి సుబాబుల్ ధర దారుణంగా పడిపోయిందని, రైతులను ఆదుకోవాలని కోరితే.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోమని ఉచిత సలహాలు ఇచ్చారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో టన్ను జామాయిల్ ధర రూ.1,800 ఉంటే.. నేడు రూ.4,800 ఉందన్నారు. పసుపు మద్దతు ధర క్వింటా రూ.6,850 ఉంటే.. నేడు బహిరంగ మార్కెట్‌లో రూ.14 వేలు పలుకుతోందని తెలిపారు. అదేవిధంగా మిర్చి రూ.24 వేలు, శనగ రూ.14 వేలకు పెరిగిందన్నారు. రైతు పండిస్తున్న ప్రతి పంటకు ప్రస్తుతం మద్దతు ధరకు మించి రేటు పలుకుతుండటంతో అన్నదాతలంతా ఆనందంగా ఉన్నారన్నారు. ఏడాదికి రూ.13,500 చొప్పున కౌలు రైతులకు సైతం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు మొదలు ఉత్పత్తి విక్రయం వరకు రైతులకు అండగా ఉండటంతో పాటు అవసరమైన సలహాలు, సూచనలు, సాగుకు సంబంధించి గ్రంథాలయం కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

పొగాకు ధరలకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించిన ప్రభుత్వం...

పొగాకు ధరలు పెంచేందుకు ఏకంగా మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం రంగంలోకి దించడంతో ఎక్స్‌పోర్టు చేయడంతో పోటీపెరిగి నేడు పొగాకు రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయని సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానా నుంచి అక్షరాలా రూ.2.16 లక్షల కోట్లను నేడు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేయడం జరిగిందన్నారు. చంద్రబాబు హయాంలో పంటల బీమాకు ప్రభుత్వం ప్రీమియం కూడా చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆర్థికంగా చితికిపోయిన రైతులు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యలు చేసుకుంటే.. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటనలు చేసి ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 600 మంది రైతులకు రూ.5 లక్షలకు బదులుగా రూ.7 లక్షలు ఇచ్చి ఆదుకున్న విషయం ప్రతి రైతన్నకు తెలుసని పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు రూ.27,062 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.1,834 కోట్లు, 18 లక్షల మంది రైతులకు పంటల బీమా కింద ప్రభుత్వం చెల్లిస్తున్న ప్రీమియం రూ.672 కోట్లు, 22 లక్షల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1,900 కోట్లు చెల్లించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 2018–19లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో వ్యవసాయ వృద్ధి రేటు మైనస్ 6.5 శాతం ఉండేదని, నేడు ప్లస్ 8.2 శాతంలో ఉందని అన్నారు. వ్యవసాయ రంగానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో చేయూతనిస్తుందనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. జాతీయస్థాయిలో ఆహారోత్పత్తుల విషయంలో రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందన్నారు. విజన్ అంటే జగన్‌మోహన్‌రెడ్డిదని, ఆయనను మరోమారు 2024లో గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయం పండుగగా మారుతుందని వివరించారు. రైతులంతా ఈ విషయాన్ని గమనించి చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మకుండా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు.

చిన్నారి కిడ్నాప్ కలకలం

- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ పరిశీలన



బాలుడి ఇంట్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు



బాలుడి తల్లి, నానమ్మతో మాట్లాడుతున్న క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు

సీఎస్ పురం (పామూరు): సీఎస్ పురం మండలం చింతలపాలెం ఎస్టీకాలనీలో బుధవారం అర్ధరాత్రి 16 నెలల చిన్నారి సాత్విక్‌షాలోన్ కిడ్నాప్ కావడం తీవ్ర కలకలం రేపుతోంది. నానమ్మ పక్కనే పడుకుని ఉన్న చిన్నారి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కనిపించకుండా పోయాడు. తెల్లవారే వరకూ గాలించినా కనిపించకపోవడంతో తల్లి కెజియా, నానమ్మ తిరుపాలమ్మ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాలతో గురువారం ఒంగోలు నుంచి వెళ్లిన డాగ్‌స్క్వాడ్ బృందం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. ఘటన స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ రామరాజు, పామూరు సీఐ కే శ్రీనివాసరావు ఆ ఇంటికి చేరుకుని బాలుడి తల్లి, నానమ్మలతో మాట్లాడారు. బుధవారం రాత్రి ఏం జరిగిందో తెలుసుకున్నారు. బాలుడి తండ్రి సామ్యేలు కొంతకాలంగా తిరుపతిలో బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అప్పుడప్పుడూ వచ్చి వెళ్తుంటాడు. 9 రోజుల క్రితం కూడా చింతలపాలెం వచ్చి వెళ్లాడు. కిడ్నాప్‌నకు గురైన బాలుడు నెలలు తక్కువగా జన్మించినట్లు సమాచారం.

నాలుగు బృందాలతో ముమ్మరంగా గాలింపు...

ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి బాలుడి కోసం గాలిస్తున్నట్లు కనిగిరి డీఎస్పీ రామరాజు తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా.. ఎవరైనా రెక్కీ నిర్వహించారా.? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. గాలింపు చర్యల్లో పామూరు సీఐ కాటూరి శ్రీనివాసరావు, సీఎస్ పురం ఎస్సై పి.అనిల్‌కుమార్, పామూరు ఎస్సై కే సురేష్‌యాదవ్, వెలిగండ్ల ఎస్సై పి.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో ఎంపీ మాగుంట పూజలు



వల్లూరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, వరికూటి

టంగుటూరు: జిల్లా ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆలయ అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్, ఈఓ రమేష్, ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు కుంకుమ పూజ, మంత్రపుష్పం, గోత్రనామార్చన పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. మొదట వరికూటి అశోక్‌బాబు, అభిమానులు టోల్ ప్లాజా వద్ద ఘన స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా వల్లూరమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద పలువురు నాయకులు గజమాలలతో సత్కరించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి దాకా పిచ్చిరెడ్డి, కుందం హనుమారెడ్డి, సర్పంచి వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవాణి, సనగర కోటి, బీసీ నాయకులు బొట్ల రామారావు, తక్కెలపాటి సుధాకర్, బెల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంభంలో మెగా జాబ్‌మేళా

కంభం: ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ స్థాయి మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 12 రకాల కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పది నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులు, విద్యార్థులు, జాబ్ మేళాలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. జాబ్‌మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

వచ్చేశాయ్.. కొత్త పెన్షన్లు

- జిల్లాలో 7,500 మందికి కొత్త పెన్షన్లు మంజూరు
- లబ్ధిదారులకు నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కనిగిరి రూరల్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ఇంటికి వచ్చి చేరుతున్నాయి. కుల, మత, పార్టీలకతీతంగా దరఖాస్తు చేసుకున్న అర్హులకు పథకాలు అందుతున్నాయి. తాజాగా జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లు మంజూరయ్యాయి. రాజకీయాల కతీతంగా గ్రామాల్లో, వార్డులో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టిన అధికారులు సెప్టెంబర్ 1 నుంచి పెన్షన్ పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వరకు జిల్లాలోని 8 నియోజకవర్గాలు, 7 అర్బన్‌లు, 38 మండలాలు కలిపి వివిధ రకాల పింఛన్లు 2,86,908 మందికి పింఛన్లు అందిస్తున్నారు. తాజాగా జిల్లాకు మరో 7,500 కొత్త పెన్షన్లు మంజూరు కాగా మరికొన్ని పరిశీలనలో ఉన్నాయి. ఆ పింఛన్లను త్వరలో మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డులు 12 సచివాలయాలున్నాయి. కనిగిరి మున్సిపాలిటీలో 2019 నాటికి 3,493 పెన్షన్‌లు ఉండగా, వాటికి సంబంధించి రూ.77 లక్షలు లబ్ధిదారులకు అందజేశారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాటి 2023 అగస్టు వరకు 4,904 పెన్షన్‌లు ఇస్తున్నారు. ఈ నెల ఒకటి నుంచి కొత్తగా 187 మంది లబ్ధిదాదరులకు నూతన పింఛన్లు అందజేయనున్నారు. మొత్తం 5,088 మంది పెన్షన్‌దారులకు పెన్షన్ కానుక నగదు రూ.రూ.1.40 కోట్ల నగదును పంపిణీ చేయనుంది. అదే విధంగా

నియోజకవర్గం	కొత్తగా మంజూరైన పింఛన్లు
దర్శి	930
గిద్దలూరు	991
కనిగిరి	1100
కొండపి	1143
మార్కాపురం	870
ఒంగోలు	720
ఎస్ఎన్‌పాడు	875
వై పాలెం	871
మొత్తం	7,500

సీఎస్‌పురం మండలానికి 154, హనుమంతునిపాడు 118, కనిగిరి 151, కనిగిరి మున్సిపాలిటీకి 187, పామూరు మండలంకు 238, పీసీపల్లి 121, వెలిగండ్ల మండలానికి 131 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 1100 కొత్త పెన్షన్‌ను సెప్టంబర్ నెల 1న పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ మలికాగర్గ్



చెక్కు అందజేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సిటీ: మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం, వివిధ కారణాలతో మరణించిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ సమావేశం నిర్వహించారు. వారందరితో మాట్లాడి సమస్యలు, యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. వారికి రావాల్సిన ఏపీజీఎల్ఐ, కారుణ్య నియామకం, ప్రమాద బీమా మొదలగు బెనిఫిట్స్ గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా కుటుంబాలకు ప్రయోజనాలన్నీ సత్వరం అందించాలని సూచించారు. మరణించిన పోలీస్ సిబ్బంది పిల్లలు చేస్తున్న ఉద్యోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మనమంతా ఒక కుటుంబమని, ఎల్లప్పుడూ ప్రకాశం పోలీసులు ఆసరాగా ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున పోలీసుశాఖ నుంచి రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకాలు పొందని కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన నియామకం పొందేలా చూస్తామన్నారు. ఏమైనా ఇబ్బందులు, సమస్యలుంటే తనను నేరుగా కలవవచ్చని, తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ స్పష్టం చేశారు. మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ మరణించిన కె.శివకృష్ణగౌడ్ సతీమణి పద్మకి ఇన్సిడెంటల్ చార్జ్ కింద రూ.25 వేల చెక్కును ఎస్పీ మలికాగర్గ్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు (అడ్మినిస్ట్రేషన్), డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఓ ఎం.సులోచన, వెల్ఫేర్ ఆర్ఐ హరిబాబు, డీపీవో సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదానికి కారణమైన కారు



సంఘటన స్థలంలో గుమికూడిన ప్రజలు



మృతుడు చెన్నయ్య

కొనకనమిట్ల: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన 565 జాతీయ రహదారి కొనకనమిట్ల మండలం మర్రిపాలెం సమీపంలో గురువారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని రేగుమానిపల్లి గ్రామానికి చెందిన తుమ్మేటి చెన్నయ్య(29) తన తండ్రి ముసలయ్య మర్రిపాలెం సమీపంలోని పొలం వద్ద కాపలా ఉంటాడు. తండ్రికి భోజనం ఇచ్చేందుకు చెన్నయ్య రేగుమానిపల్లి నుంచి వెళుతున్నాడు. కొంచెం దూరం వెళితే తనతండ్రికి భోజనం ఇచ్చేవాడు. అయితే రోడ్డున నడుచుకుంటూ వెళుతున్న చెన్నయ్యను శ్రీశైలం నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఎగిరి కిందపడిన చెన్నయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చెన్నయ్య బేల్దారీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చెన్నయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. చెన్నయ్య మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి ఉన్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం చెన్నయ్య మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొట్లాట కేసులో ఏడాది జైలుశిక్ష

కనిగిరి రూరల్: పామూరు మండలం బొట్లగూడూరులో 2017 ఏప్రిల్ 11వ తేది రాత్రి కూల్‌డ్రింక్ షాపు వద్ద నిలబడి ఉన్న పోలినేని ప్రసాద్‌పై కోటిపాటి బలరామ కృష్ణా అనే వ్యక్తి దాడి చేసి తలపై గాయపర్చాడు. ఘటనలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రసాద్ ఫిర్యాదు మేరకు పామూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విచారణకు రాగా, నేరం రుజువైనందున నిందితుడు బలరామకృష్ణకు ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కనిగిరి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ జడ్జి కె.భరత్‌చంద్ర గురువారం తీర్పు చెప్పారు.

3న ఫుట్‌బాల్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక

ఒంగోలు: ఫుట్‌బాల్ అండర్–17 జిల్లా బాలబాలికల జట్లను ఈ నెల 3వ తేదీ స్థానిక ఏబీఎం గ్రౌండ్‌లో ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కావూరి విన్సెంట్, కార్యదర్శి అంచిపోగు రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. 2008 జనవరి 1 నుంచి 2009 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు వయసు నిర్ధారణకు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని వివరించారు. వివరాలకు 99088 22193, 98497 60566ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగాల నోటిఫికేషన్ గడువు పూర్తి

ఒంగోలు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 2022 ఆగస్టు నెలలో జారీ చేసిన నోటిఫికేషన్ గడువు ముగిసినట్లు డీఎంహెచ్ఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలోని డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి తుది మెరిట్ జాబితా గడువు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు మాత్రమే వాలిడ్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. గురువారంతో తుది మెరిట్ జాబితా గడువు ముగిసింది కాబట్టి ఇకపై ఎటువంటి ఉద్యోగ ఎంపికలు చేయబోమని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు గ్రామ సమీపంలో కోళ్ల ఫారం వద్ద కూలీ పని చేస్తున్న యాడిగంటి శ్రీనివాసరావు(27) ఆస్పత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై పవన్‌కుమార్ గురువారం తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు గత కొంత కాలంగా పసుపుగల్లు వద్ద కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. గత నెల 20వ తేదీన కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదం, అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఆస్పత్రి నుంచి సమాచారం మేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య సంధ్యారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సెల్యూట్ జ్యోతి

జ్యోతి పరుగెడితే.. పతకాలు ఆమె వెంట నడిచొచ్చాయి. జీవితం సాఫీగా సాగుతోందనుకుంటున్న సమయంలో కష్టాలు ఆమె కన్నా వేగంగా పరుగు తీస్తూ చుట్టుముట్టేశాయి. కరోనా రక్కసి తండ్రిని బలి తీసుకోగా.. తల్లి అనారోగ్యం పాలైంది. తోడబుట్టిన అక్కను క్యాన్సర్ మహమ్మారి ఆవరించింది. అయినా జ్యోతి పరుగాపలేదు. అథ్లెటిక్స్‌లో ఉన్న అనుభవం ఆమెను మరింత వేగంగా పరుగెత్తేలా చేసింది. పోలీస్ కావాలన్న తన లక్ష్యాన్ని భర్త ప్రోత్సాహంతో సాధించింది. తన కుటుంబంలో అలుముకున్న కష్టాల చీకటిని 'జ్యోతి' తొలగించింది.



జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో సాధించిన పతకాలతో జ్యోతి

- తెలంగాణలో ఏఆర్ ఎస్సైగా ఉద్యోగం సాధించిన ద్వారకచర్ల బిడ్డ జ్యోతి
- తండ్రి మరణం, అక్కకు క్యాన్సర్, అమ్మ ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రమే..
- కష్టాలను అధిగమించి లక్ష్యం దిశగా అడుగులు



కుటుంబ సభ్యులతో ఉన్న జ్యోతి

కొమరోలు: కొమరోలు మండలం ద్వారకచర్ల గ్రామానికి చెందిన బొడ్డు జ్యోతికి ఖాకీ ధరించాలనేది చిన్ననాటి కల. ఎస్సై కావాలనే లక్ష్యంతో ముందడుగు వేసింది. అడుగులు కాదు.. ఏకంగా లక్ష్యం వైపు పరుగుతీసింది. జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్‌లో సత్తా చాటి ఎన్నో పతకాలు సాధించింది. 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం ఎక్కడ నిర్వహించినా అక్కడ జ్యోతి ప్రత్యక్షమయ్యేది. చిరుతలా దూసుకెళ్లి పతకాలు కైవసం చేసుకునేది.

కరోనా నుంచి కష్టాలు

కరోనా ముందు వరకు జ్యోతి కుటుంబం ఎంతో ఆనందంగా గడిపింది. జ్యోతి లక్ష్యాలను ప్రోత్సహిస్తూ చేదోడుగా ఉన్న తండ్రి రమణారెడ్డి రెండేళ్ల క్రితం కరోనాతో మృత్యువాతపడ్డారు. తండ్రి మృతి చెందిన కొన్ని రోజులకే అక్కకు క్యాన్సర్ అని తెలియడం, తల్లి ఆరోగ్య పరిస్థితి బాగోలేక పోవడం తదితర పరిణామాలు జ్యోతి లక్ష్యానికి కొంతవరకు అడ్డంకిగా మారాయి. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు కూడా బాగోలేకపోవడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ అకాడమీలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తూ ఎస్సై కావాలనే లక్ష్యాన్ని వదిలేయకుండా శిక్షణ పొందసాగింది. 2022లో తెలంగాణ ప్రభుత్వం ఎస్సై నోటిఫికేషన్ విడుదల చేయడంతో వెంటనే దరఖాస్తు చేసుకుని, ప్రిలిమ్స్‌కు కూడా ఎంపికైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన రాత పరీక్షలో సత్తా చాటడంతో జ్యోతి ఏఆర్ ఎస్సైగా ఎంపికైంది. అథ్లెటిక్స్‌లో ప్రతిభే తనకు ఎస్సై కొలువు దక్కేలా చేసిందని ఆమె సంతోషం వెలిబుచ్చింది.

> **కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నే..**
> మా కుటుంబం వ్యవసాయం మీద ఆధారపడి జీవించేది. తల్లిదండ్రులతోపాటు నా భర్త శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో నేననుకున్న లక్ష్యాన్ని సాధించగలిగా. తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాలను గుర్తించి ప్రోత్సహిస్తే తప్పకుండా ఆయా రంగాల్లో రాణిస్తారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని బాధలు భరించైనా సరే లక్ష్యాన్ని చేరుకుంటారు.
> – బొడ్డు జ్యోతి

సాంకేతికతతో ఉన్నత స్థానం



సిటీ 352 : ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుబ్బారావు

- డీఈవో సుబ్బారావు

ఒంగోలు: ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారానే ఉన్నత స్థానంలో ఉండగలమని డీఈఓ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. బైజూస్ యాప్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీల వినియోగంపై 38 మండలాల్లోని నోడల్ అధికారులకు గురువారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికత విద్యా ప్రమాణాల పెంపుదలకు ఇతోధికంగా కృషి చేస్తుందన్నారు. బైజూస్ ట్యాబ్‌ల వినియోగ సమయంలో ఎర్రర్లపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని నోడల్ అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం ట్యాబ్‌లో యూసేజ్ అప్‌డేట్ చేయాలని చెప్పారు.

మార్పులు చేయాలని చూస్తే..

విద్యార్థులకు అందించిన ట్యాబుల్లో మార్పులు చేయాలని యత్నిస్తే వెంటనే హెడ్మాస్టర్, మండల స్థాయి ఐటీ సహాయకులుగా పనిచేసే ఉపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ సిబ్బందికి సమాచారం చేరేలా ఐటీ బృందం చర్యలు చేపట్టిందని జిల్లా నోడల్ అధికారి కొప్పోలు అశోక్‌కుమార్ తెలిపారు. ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు, జరుగుమల్లి ఎంఈఓ నాగేంద్రవదన్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి, జిల్లా అసిస్టెంట్ నోడల్ అధికారి డి.వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఆర్ఎం పాఠశాల తనిఖీ

ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూల్‌ను డీఈఓ తనిఖీ చేశారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను ఆరా తీశారు. వారి పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

కంకర లోడ్ టిప్పర్ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లి ఘాట్‌లో కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ గురువారం అదుపు తప్పి బోల్తా పడింది. లారీ మర్రిచెట్లపాలెం నుంచి బేస్తవారిపేటకు కంకరలోడుతో వెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్ వెంకటేశ్వర్లు, క్లీనర్ కోటిరెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి వైద్యశాలకు తరలించారు.



రోడ్డుపై బోల్తా పడిన టిప్పర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దర్శి: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణంలోని శివరాజనగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. శివరాజనగర్‌కు చెందిన ఏసుబాబు కుమార్తెను భార్య బాలమ్మ తరుపు బంధువులకు ఇచ్చి వివాహం చేసేందుకు నిశ్చయించారు. అయితే ఆ వివాహాన్ని ఏసుబాబు వ్యతిరేకించాడు. అయినా వివాహం చేయడంతో అతను 100కి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా చెప్పినట్లు ఎస్సై తెలిపారు. ఇది ఇలా ఉండగా పోలీసుల దెబ్బలకు తట్టుకోలేక మానసికంగా క్రుంగిపోయి ఏసుబాబు ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. పెళ్లిని అడ్డుకుంటున్నాడని భార్య, వియ్యంకుడు విడివిడిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు విచారణ పేరుతో ఏసుబాబును వేధించారని, దీంతో మానసికంగా క్రుంగిపోయిన అతను వేపచెట్టు వద్దే ఉరేసుకొని ప్రయత్నించడంతో తాము గమనించి ఇంటికి తీసుకువచ్చామని మృతుని తమ్ముడు, చెల్లెలు తెలిపారు. అయితే గురువారం సాయంత్రం తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు 100 ద్వారా పోలీసులకు తెలిపి ఇంట్లో ఉరేసుకున్నాడు. పోలీసులు ఇంటికి వచ్చేసరికి ఏసుబాబు మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు